


ఉద్దండు పరిగెత్తు కొచ్చి ఆగిపోయాడు. ఎంత దూరం నుంచి వచ్చాడో, రొప్పుతున్నాడు.

వార్డెన్ రాజమ్మ తలెత్తి చూసింది.

ఉద్దండు ముఖం చెమట కక్కుతోంది. ఆందోళనగా ఉన్నాడు. చొక్కా తడిసిపోయి ఉంది.

"ఏమిటి?" ప్రశ్నించింది వార్డెన్.

"కిష్టయ్యని పాము కరిసింది." చెప్పాడు ఉద్దండు.

వార్డెన్ చేతిలో కలం జారిపోయింది.

"ఆఁ..." అంది భయంతో.

ఆమె గుండె ఆగిపోయి నట్లయింది.

"ఎక్కడ?"

"పొలంలో...!"

"నువ్వు కూడా ఉన్నావా?"

"ఆఁ..."

"పొలంలోకి ఎందు కెళ్ళారు?"

ఉద్దండు రెండు వేళ్ళు చూపించాడు.

వార్డెన్ పరిగెత్తింది.

క్షణాల్లో హాస్టల్లో పిల్లలందరికీ తెలిసిపోయింది కిష్టయ్యని పాము కాటేసింది. అందరూ పరుగు తీశారు.

అప్పటికే కిష్టయ్యలో చలనం లేదు.

ఎప్పుడో ప్రాణాలు పోయాయి.

** ** **

హాస్టల్లో ఉండే కిష్టయ్యని పాము కరిచిందనీ, చచ్చిపోయాడనీ ఊరంతా తెలిసిపోయింది.

వార్డెన్ పక్క ఊళ్ళో ఉన్న కిష్టయ్య తల్లిదండ్రులకు కబురు చేసింది.

పోలీసులు వచ్చారు.

ఆ వార్డు కౌన్సిలర్ వచ్చాడు.

మున్సిపల్ ఛైయిర్మన్ వచ్చాడు.

అపొ జిషన్ పార్టీల కార్యకర్త లొచ్చారు.

పొజిషన్ పార్టీల నాయకు లొచ్చారు.

సంక్షేమ శాఖ అధికారు లొచ్చారు.

తా శీల్దారు వచ్చాడు.

పోలీసులు వచ్చారు.

పత్రికా విలేఖర్లు వచ్చారు.

ఆ వచ్చిన వాళ్ళందరికీ సమాధానాలు చెప్పలేక వార్డెన్ రాజమ్మకి చచ్చే చా విచ్చి పడింది.

పోలీసులు శవాన్ని పోస్టుమార్టమ్ చేయించారు. తల్లిదండ్రులకు అప్పచెప్పారు.

** ** **

ఎమ్మెల్లే లింగయ్య అర్జెంటుగా పరిగెత్తు కొచ్చాడు. ఈ గొడవ జరిగింది ఆయన నియోజకవర్గంలోనే. అలాగని చనిపోయిన కిష్టయ్య కుటుంబం మీద ప్రేమతో మాత్రం రాలేదు. వార్తల్లోకి ఎక్కాలని వచ్చాడు. ఇరవై ఏళ్ళ నుంచి ఎమ్మెల్లేగా ఉంటున్నా మంత్రి పదవి దక్కలేదు. ఎయిర్ బస్ మంత్రివర్గాల్లో సైతం చోటు దొరకలేదు. కనీసం ఒక్క కార్పొరేషన్ ఛైయిర్మన్ పదవి కూడా సంపాదించలేకపోయాడు. ఇంట్లో పెళ్ళాం, పిల్లలు పోరు పెడుతున్నారు. బయట అనుయాయులు అల్లరి చేస్తున్నారు. తను ఇన్నాళ్ళూ గంగిరెద్దులా తలూపుతూ కూర్చోవడం వల్లనే గదా త న్నెవరూ లెక్క చెయ్యడంలేదని అనుకున్నాడు. అంతే అప్పట్నుంచి ఎక్క డేం జరిగినా వెళ్ళి ప్రతిపక్షాల వాళ్ళ కంటే ముందుగా గొడవ చెయ్యడం మొదలుపెట్టాడు. అధికారుల్ని మంత్రుల్ని తీవ్రంగా విమర్శించి పేపర్లోకి ఎక్కుతున్నాడు. అదో తృప్తి. ఎప్పటికైనా తనని గుర్తించి మంత్రి పదవి కట్టబెట్టరా అని ఆశ.

ఎమ్మెల్లే లింగయ్య వచ్చీరాగానే అనుచరులు చుట్టుముట్టారు. అందరూ కలసి కిష్టయ్య తల్లిదండ్రుల్ని పరామర్శించారు. కుర్రాడు పోయినందుకు డబ్బు ఇప్పిస్తానని హామీ

ఇచ్చాడు.

ఆ తర్వాత ఊళ్ళో కొచ్చి మీటింగ్ పెట్టాడు. వార్డెన్ అసమర్థత కారణంగా కిష్టయ్య ప్రాణాలు పోగొట్టుకున్నాడని ఘాటుగా విమర్శించాడు. ఆవిణ్ణి వెంటనే సస్పెండ్ చేసి హాస్టల్లో మిగిలిన పిల్లల్ని కాపాడాలని సదరు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని సభాముఖంగా కోరాడు.

మర్నాడు పేపర్లో లింగయ్య సభ గురించి ప్రముఖంగా అచ్చయింది. మీటింగ్‌లో ఉరుములు, మెరుపులు కురిపించాడని, ప్రభంజనంలా విరుచుకుపడ్డాడని మెచ్చుకున్నారు.

** ** **

ఎక్క డేం జరిగినా ప్రతిపక్షాల వాళ్ళు కాకుల్లాగ, గొంతు తెగిన మేకల్లాగ అరవడం ఆచారమే. కాని అధికార పక్షాల వాళ్ళు అరిచి గోల పెట్టడం అనాచారం. ఆచారం గురించి ప్రభుత్వం పట్టించుకోదు. మామూలే అని చప్పరిస్తుంది. అనాచారం జరుగుతున్నదని వార్త రాగానే ప్రభుత్వం బెంబేలు పడుతుంది. లింగయ్య మనవాడే అయినా ఎందు కిలా అరుస్తున్నాడని అనుమానిస్తుంది. అతగాడి వెనుక ఏ మంత్రి నిప్పు రాజేస్తున్నాడు? ఏ గ్రూపు పొగలేస్తున్నది?-అని రక రకాల సందేహాలు వస్తాయి. ఎందుకైనా మంచిదని వళ్ళు దగ్గర పెట్టుకుంటారు.

కిష్టయ్య మృతి పైన దర్యాప్తు జరిపించింది ప్రభుత్వం. అంతవరకు సదరు వార్డెన్ని సస్పెండ్ చేశారు. వార్డెన్ రాజమ్మ లబోదిబో మని కోర్టుకి వెళ్ళి 'స్టే' తెచ్చుకుంది. ప్రస్తుతం ఆవిడకు ఇంట్లో కూర్చోబెట్టి జీతం ఇస్తున్నది ప్రభుత్వం. వట్టి జీతమే తప్ప గీతం రావడంలేదని దిగులుతో సగమైపోయింది రాజమ్మ. ఏనాటికైనా గెలుపు ధర్మానిదే కదా, దేవుడనే వాడు లేడా? తనని రక్షించడా? అనుకుంది. ఈసారి తను వార్డెన్‌గా చార్జి తీసుకుని, మొదటి నెలలో వచ్చిన లాభం అంత సమర్పిస్తానని ఏడుకొండలవాడికి మొక్కుకుంది.

కొన్నాళ్ళకి నివేదిక బయటపడింది.

హాస్టల్ అద్దెకు ఉంటున్న ఇల్లు చాలా పాతది. కనీస సౌకర్యాలు లేవు. ఇంటి యజమాని రాసిచ్చిన ఎగ్రిమెంట్‌లో రెండు నెలల్లో మరుగుదొడ్లు కట్టిస్తానని హామీ ఇచ్చాడు. మూడు సంవత్సరాలు గడిచిపోయినా మరుగుదొడ్లు కట్టించలేదు. అందువల్ల హాస్టల్లో ఉంటున్న పిల్లలు దూరంగా పొలాల్లోకి వెళ్ళడం తప్ప వేరే గత్యంతరం లేకపోయింది. ఈ విషయం వార్డెన్ పై అధికారులకు ఎన్నోసార్లు తెలియజేసినట్లు రికార్డ్‌లో ఉంది.

ఇందులో కిష్టయ్య మృతికి సంబంధించి వార్డెన్ తప్పు ఏమీ లేదు. ఇంటి యజమానిదే పూర్తి బాధ్యత. అతను త.ను రాసిచ్చిన ఎగ్రిమెంట్ ప్రకారం నడుచుకోలేదు. నెల నెలా పదిహేను వందలు అద్దె వసూలు చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ, మరుగుదొడ్లు కట్టించడంలో చూపలేదు. కాబట్టి ఇంటి యజమాని పుల్లారావుని ప్రాసిక్యూట్ చేయవలసి ఉంది.

** ** **

వార్డెన్ రాజమ్మ మళ్ళీ డ్యూటీలో చేరింది.

హాస్టల్ అద్దె కిచ్చిన యజమాని పుల్లారావు మాత్రం లబోదిబో మని గోల పెడుతూ ఎమ్మెల్లే లింగయ్య దగ్గరికి వెళ్ళాడు. పుల్లారావు స్వయానా లింగయ్యకి బావమరిదే పాపం.

జరిగిం దంతా చెప్పి బావురు మన్నాడు పుల్లారావు.

"ఇదంతా నువ్వు చేసిన అల్లరి వల్లే జరిగింది. లేకపోతే అంతా గప్‌చిప్‌గా ఉండిపోయేది. ఇప్పుడు నా కొంప మీదికి తెచ్చావు. నన్ను జైలుపాలు చేశావు" అని బావ మీద విరుచుకు పడ్డాడు పుల్లారావు.

"ఉరిమి ఉరిమి మంగలం మీద పడ్డట్టు, అంతా నీ మీదకు వస్తుందని నా కేం తెలుసురా? ఆ హాస్టల్ బిల్డింగ్‌లో లొసుగు ఉందని ఎప్పుడైనా చెప్పేడిశావా? చెప్తే నోర్మూసుకుని ఉండేవాడిని గదా! ఇప్పు డొచ్చి ఏడిస్తే ఏం లాభం?" అన్నాడు ఎమ్మెల్లే లింగయ్య.

పుల్లారావు దిక్కుతోచక వెర్రి చూపులు చూశాడు.

"అయినవాళ్ళకి ఏదైనా మేలు చెయ్యడం చేతగాకపోయినా, అనవసరంగా యాగీ చేసి మా తమ్ముడి ప్రాణం మీదకు తెచ్చారు." లోపల్నుంచి ఉరిమింది లింగయ్య ధర్మపత్ని.

"ఊరికే నోరు పారేసుకోకు. ఇప్పు డేం కొంప మునగలేదులే. గవర్నమెంట్ దర్యాప్తు చెల్లదని కోర్టుకి వె ళ్ళొచ్చులే. ఏడ్చి చావకండి" అని విన విన లాడాడు లింగయ్య.

తర్వాత బామ్మర్దిని తీసుకుని హైదరాబాద్ బయల్దేరాడు ఎమ్మెల్లే లింగయ్య. *



ఫోటో: ఆర్.బి. పింటో [క్లోస్కర్]